భార్యాభర్తల పంచాయతీలో ఘర్షణ

- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్

మంచిర్యాల, జనవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దండేపల్లి మండల కేంద్రంలో భార్యాభర్తల పంచాయతీ తీవ్ర ఘర్షణకు దారి తీసింది. స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో జరిగిన సంఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెల్గనూర్‌కు చెందిన మహిళ, శ్రీరాంపూర్‌కు చెందిన యువకుడు (భార్యాభర్తల) పంచాయతీ స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో పెద్ద మనుషుల సమక్షంలో బుధవారం జరిగింది. వెల్గనూర్‌కు చెందిన అమ్మాయి తరపున వారు శ్రీరాంపూర్‌కు చెందిన అబ్బాయి తరపున కొంత మందిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరు పక్షాలు పెద్ద మనుషుల సమక్షంలో బయట మాట్లాడుకుంటున్నారు. అమ్మాయి తరపు అనుచరులు తమపై దాడి చేసేందుకు వస్తున్నారనే సమాచారం మేరకు అబ్బాయి తరపువారు పోలీస్‌స్టేషన్‌లో వెళ్లి తెలిపారు. పోలీసు సిబ్బందికి అక్కడికి వెళ్లే లోపే గుర్తు తెలియని కొంది మంది తీవ్రంగా దాడి చేసి, గాయపర్చారని వారు తెలిపారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందించినట్లు వారు తెలిపారు.

కాలం చెల్లిన వెహికిల్స్ తొలగించాలి

శ్రీరాంపూర్, జనవరి 22 : శ్రీరాంపూర్, ఆర్కేపీ ఓసీపీల్లో ఎక్స్‌ప్లోజివ్ తరలించే కన్వీనియన్స్ వాహనం కాలం చెల్లిందని, వెంటనే తొలగించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రమేశ్, కేంద్ర సంయుక్త కార్యదర్శి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేశ్, ఆర్గనైజర్ అన్వేష్‌రెడ్డి, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే మహిళా ఉద్యోగులకు ప్రత్యేక రెస్ట్ హాల్స్ ఏర్పాటు చేయాలని, మైనింగ్, ఈఅండ్ఎం సూపర్‌వైజర్స్, టెక్నీషియన్స్‌ను భర్తీ చేయాలని పేర్కొన్నారు.

వేలం ప్రకటన

ఈ క్రింద తెలుపబడిన వాహనములు మాకు రావల్సిన బకాయిల నిమిత్తం తేది:31/01/2025 శుక్రవారం మ|| 1 గం||లకు మా ఆఫీసు ఆవరణలో వేలం వేయబడును తుది నిర్ణయం ఫైనాన్స్ వారిదే.
1) మొగిలిపాక రజిత W/o. శ్రీనివాస్, గ్రా|| నస్పూర్, మం|| నస్పూర్, జి|| మంచిర్యాల. Vechile: TATA Lorry, Model: 2008, Vechile no: AP36X8169
2) కోట అంజిరాజు S/o. గౌరయ్య, గ్రా|| కొమురవెల్లి, మం|| రెబ్బెన, జి|| కొమురంభీం ఆసిఫాబాద్. Vechile: JOHN DEERE HARVESTER, Model: 2014, Vechile No: AP22AR8465.
3) ఆవుల శ్రీనివాస్ S/o. ఐలయ్య, గ్రా|| సిసిసి నస్పూర్, మం|| నస్పూర్, జి|| మంచిర్యాల. Vechile: ASHOK LORRY, Model: 2006, Vechile No: AP16TW1130.
4) ఎల్కటూరి రాజేందర్ S/o. పోషం, గ్రా|| సిసిసి నస్పూర్, మం|| నస్పూర్, జి|| మంచిర్యాల. Vechile: ASHOK LORRY, Model: 2008, Vechile No: AP16TX5325.
5) ఒల్లపు రాజయ్య S/o. ధర్మయ్య, గ్రా|| అంతర్గాం, జి|| పెద్దపల్లి. Vechile: SWARAJ: 735 Tracter , Model: 2014, Vechile No: AP15TC6779

వైష్ణవి హెచ్.పి & ఫైనాన్స్
OPP:లక్ష్మీ థియేటర్, బెల్లంపల్లిరోడ్ మం||&జి||మంచిర్యాల.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

నిరసనలు.. నిలదీతలు

వాంకిడి : అర్హులకు ఎందుకు ఇవ్వడం లేదంటూ గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న మహిళలు

రెబ్బెన : నంబాల గ్రామంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

కౌటాల : మొగడ్ ధగడ్ గ్రామ సభలో అధికారులు, గ్రామస్తుల మధ్య వాగ్వాదం

ఇండ్లున్నవారికే ఇందిరమ్మ ఇండ్లు..

రాజీవ్‌నగర్ ఏరియా బాధితుల ఆవేదన..

మంచిర్యాల అర్బన్, జనవరి 22 : ఇండ్లు ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లను ఇస్తున్నారని, లిస్టులో వారి పేర్లే వచ్చాయని, అధికారులు చర్యలు తీసుకొని పేదలకు న్యాయం చేయాలని మంచిర్యాల ఒకటో వార్డు రాజీవ్‌నగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో గల మోడల్ స్కూల్‌లో వార్డు సభ సమావేశాన్ని సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్నా తమ పేర్లు ఎందుకురాలేదని స్థానికులు అధికారులను నిలదీశారు. ఈ క్రమంలో అక్కడ వాతావరణం గందరగోళంగా మారడంతో పోలీసులు, మున్సిపల్ కమిషనర్ మారుతీరావు చేరుకున్నారు. ఇండ్లున్నవారి పేర్లే లిస్టులో వచ్చాయి.., తమ పేర్లు ఎందుకు రాలేదని కమిషనర్‌ను మహిళలు ప్రశ్నించారు. అలా జరిగితే పరిశీలించి, సర్వే చేసి తొలగిస్తామని చెప్పారు.

వార్డు సభలో రసాభాస..

మంచిర్యాల (ఏసీసీ), జనవరి 22 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏడో వార్డు పరిధి ఎన్టీఆర్ నగర్‌లో సభలో గందరగోళం నెలకొన్నది. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు రాలేదని స్థానికులు ఆందోళన చేశారు. ఇక ఇరుకైన ప్రదేశంలో సభ పెట్టడంతో మధ్యాహ్నం చాలా మంది ఎండకు ఇబ్బంది పడుతూ కనిపించారు. గర్మిళ్లలోని పాఠశాలలో జరిగిన వార్డు సభలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. స్టాంప్ ప్యాడ్ కూడా లేకపోవడంతో వృద్ధులు చేతికి సిరా రాసుకొని వేలిముద్రలు వేస్తూ అవస్థలు పడ్డారు. రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల లిస్టును చూపించేందుకు అధికారులు ఆసక్తి చూపించలేదు. అడిగిన వారిపై చిరాకు పడ్డారు.

ఉన్నావారికే ఇండ్లు ఇస్తారా..

పొనకల్‌లో ఎంపీడీవోను నిలదీసిన మహిళలు

జన్నారం, జనవరి 22 : జన్నారం మండలం పొనకల్ గ్రామ సభలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లిస్టులను ఎంపీడీవో శశికళ చదువుతుండగా.. అర్హులకు ఇండ్లు మంజూరుకాకోపోవడంపై సుందరయ్య కాలనీకి చెందిన కామెర కవిత, మగ్గిడి జయ, శారధ, వనిత, ఈ సత్తవ్వ, కే అనూష నిలదీశారు. ఎంపీడీవో స్పందిస్తూ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ భరోసా, రైతు భరోసా లిస్టులో పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పి, సభను అర్థాంతరంగా ముగించారు. అనంతరం అక్కడ ఉన్న అంగన్‌వాడీ టీచర్లు దరఖాస్తులను స్వీకరించారు.

కాంగ్రెస్ నాయకుల హల్‌చల్..

పొనకల్, రేండ్లగూడ గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో కాంగ్రెస్ నాయకులు హల్‌చల్ చేశారు. అక్కడ ఉన్న అధికారులను కాదని అన్నింటికీ నాయకులే మైకులు పట్టుకొని సమాదానం చేప్పడంతో కొంతమంది ప్రజలు వారిపై తిరుగబడ్డారు. 'అధికారులు ఉండగా, మీరేంటి మాకు చెప్పేది..' అని నిలదీశారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయింపు..

కామన్‌పెల్లి గ్రామానికి చెందిన నాయికపుగూడ కాలనీవాసులు.. ఇండ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. తమను అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. 21వ తేదీన సమాచారం ఇవ్వకుండానే గ్రామ సభను నాయకులు, అధికారులు నిర్వహించారని మండిపడ్డారు. ఎలక్షన్ల సమయంలో ఓట్లు వేయించుకున్న తర్వాత తమను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు.

ఇండ్లు అందరికా.. కొందరికా.. నిలదీసిన ప్రజలు

నెన్నెల, జనవరి 22 : నెన్నెల మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాను కార్యదర్శి సురేశ్ చదివి వినిపిస్తుండగా.. ఇండ్లు అందరికా.. కొందరికా అని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. గతంలో ఇల్లు కట్టుకున్న నలుగురి పేర్లను అర్హుల జాబితాలో చేర్చారని, సర్వే తీరును తప్పుబట్టారు. పదేండ్ల కిందటే ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్నారని వారి పేర్లు ఎలా చేర్చుతారని నిలదీశారు. ఇంటి వద్ద ఉండి సర్వే చేశారా..? అని ప్రశ్నించారు. అర్హులకు ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని నాయకులు, ప్రజలు హెచ్చరించారు. అలాగే భూములున్న వారి పేర్లు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఉన్నాయని, అర్హులైన వారి పేర్లు ఎందుకు చేర్చలేదని నిలదీశారు. రేషన్‌కార్డుల పేర్లలోను తండ్రీకొడుకులకు వచ్చాయన్నారు. అలాగే రైతు బంధు, రుణమాఫీ, రేషన్ కార్డులపై అధికారులను నిలదీశారు.

వాంకిడిలో గడబిడ..

వాంకిడి, జనవరి 22 : వాంకిడి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ రసాభాస, గడబిడగా మారింది. కాగా, పంచాయతీ కార్యదర్శి శివకుమార్.. లబ్ధిదారుల వివరాలు చదువుతుండగా, ఇండ్ల పథకంలో అర్హత లేని వారిని గుర్తించారని, దరఖాస్తు చేసుకున్న జాబితాలో పేర్లు లేకపోవడంతో అధికారుల పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని మండిపడ్డారు. అధికారులు సర్వే సక్రమంగా నిర్వహించలేదని ఆరోపించారు. కాగా, అధికారులు మాత్రం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పి చేతులు దులుపుకున్నారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ డేవిడ్ గ్రామ సభలో పాల్గొని, మాట్లాడారు. జాబితాలో పేరు రాలేదని ఆందోళన చెందవద్దని, ఇది తుది జాబితా కాదని తెలిపారు.

భీమారంలో గందరగోళం..

భీమారం, జనవరి 22 : భీమారం మండలంలోని స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సభలో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. రేషన్ కార్డులు, ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై లబ్ధిదారులు మండిపడ్డారు. అర్హులను ఎలా గుర్తించారని ప్రశ్నించారు. ప్రజా పాలనలో రేషన్ కార్డు కోసం దరఖాస్తులు తీసుకుంటే అవి ఏమయ్యాయి..?, మళ్లీ దరఖాస్తులు ఎందుకు పెట్టుకోవాలని మండల ప్రత్యేకాధికారి కల్పన, ఎంపీడీవో మధుసూదన్, తహసీల్దార్ సదానందంను నిలదీశారు. స్థానిక యువకుడు రాపెల్లి రాజన్న యాదవ్ అధికారుల నుంచి మైక్ తీసుకొని.. 'స్థానిక సంస్థల ఎన్నికల స్టంటే గ్రామ సభలు.., తప్పుల తడకలుగా సర్వే.., దరఖాస్తుల పేరిట కాలయాపన ఎందుకు..? పోలీస్ పహారాలో గ్రామ సభలు నిర్వహించడం ఏంటి..?' అని ప్రశ్నించాడు. కాగా, పోలీసులు దగ్గర ఉండి సభను ముందుకు నడిపించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్ల కోసం గ్రామ సభ నిర్వహించాల్సి ఉండగా, రేషన్ కార్డు పేర్లు చదువుతున్న క్రమంలో ఇంటి పేర్లు లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చేశారు. అధికారులు ఎవరి కోసం పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుడు పోడేటి రవి అధికారుల నుంచి మైక్ తీసుకొని సంయమనం పాటించాలని, అర్హులందరికీ పథకాలు వస్తాయని తెలుపగా, మరో వర్గం కాంగ్రెస్ నాయకులు ఆవుల సురేశ్ యాదవ్, ఆవిడపు రవితేజ, సందనవేణి అజయ్ మాట్లాడుతూ.. నాయకులు ఇక్కడ గ్రామ సభ నిర్వహించాల్సింది కాదని, ఎందుకు మాట్లాడుతున్నారని పోడెటి రవిపై మాటల దాడికి దిగారు. అధికారులు మైకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అధికారులు నిర్వహించాల్సిన గ్రామసభ నాయకులు చేయాలా అని నిలదీశారు. కాగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల బాహాబాహీ జరిగింది. బీఆర్ఎస్ అధికారంలో ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతుండగా.., బీఆర్ఎస్ హయాంలో రేషన్ కార్డు ఇలా ఇవ్వలేదని, మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే ఇంటికే వచ్చాయని నాయకులు వీరగోణి రమేశ్ గౌడ్, సుంకరి గోపాల్, సుంకరి భూమేశ్ స్పష్టం చేశారు. దీంతో గోడవకు దారితీయడంతో ఎస్ఐ శ్వేత కలుగజేసుకొని విడదీశారు.

ఎందరికి మంజూరు చేశారు.. కన్నెపల్లిలో నిలదీత..

మంచిర్యాల టౌన్ (దండేపల్లి), జనవరి 22 : మండలంలోని చింతపల్లి, ముత్యంపేట, కొర్విచెల్మ, రెబ్బెన్‌పల్లి, గూడెం, కన్నెపల్లి, నెల్కి వెంకటాపూర్, నర్సాపూర్, ద్వారక, ధర్మరావుపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కన్నెపల్లిలో గ్రామసభ ప్రారంభమైన తర్వాత ఇందిరమ్మ ఇండ్లు ఎంతమందికి మంజూరు చేశారో తెలుపాలని, లిస్ట్‌లో ఉన్న పేర్లు చదివి వినిపించాలని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. రేషన్ కార్డులు కొందరికే మంజూరు చేశారని, రానివారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని అంటున్నారని, ఇంకెన్ని దరఖాస్తులు తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.2లక్షల రుణమాఫీ ఎక్కడా..?బోనస్ ఇంకెప్పుడు వేస్తారంటూ నిలదీశారు. కాంగ్రెస్–బీఆర్ఎస్–బీజేపీ నాయకుల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. పోలీసులు సముదాయించే ప్రయత్నం చేశారు. కొర్విచెల్మ(రాజంపేట)లో జనాలు లేక గ్రామ సభ వెలవెలబోయింది. దరఖాస్తులు తీసుకొవడమే తప్ప ఏమైనా మంజూరయ్యేది ఉందా..? అని గ్రామస్తులు వాపోయారు.

అర్హుల పేర్లు లిస్ట్‌లో లేవని నిలదీత..

మందమర్రి రూరల్, జనవరి 22 : మందమర్రి మండంలోని వెంకటాపూర్, పొన్నారం, సారంగపల్లి, పులిమడుగు, శంకర్‌పల్లి గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. చిర్రకుంటలో ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో అర్హుల పేర్లు లేవని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. తహసీల్దార్ సతీశ్ కలుగజేసుకొని.. ఈ లిస్ట్‌లో అభ్యంతరాలుంటే తెలియజేయాలని, పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. పోలీసులు జోక్యం చేసుకొని అల్లరి కాకుండా శాంతింపజేశారు.

కాంగ్రెస్ నాయకుల హవా..

మందమర్రి, జనవరి 22 : మందమర్రి మున్సిపాలిటీ పరిధి 12 వార్డుల్లో నిర్వహించిన సభల్లో కాంగ్రెస్ నాయకుల హవా కనిపించింది. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్న సభలో కూడా ప్రొటోకాల్‌కు విరుద్ధంగా వేదికపై కూర్చోవడం, పలువురు నాయకులు వెనుకాల నిల్చోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసింది. అధికారులు సైతం అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంతో నాయకులు మరింత ముందుకు వచ్చి సిబ్బందికి బదులుగా జాబితాలోని లబ్ధిదారుల పేర్లను వారే చదవడం కనిపించింది. ప్రభుత్వ పథకాలను తామే అందిస్తున్నామనే రీతిలో వ్యవహరించడంపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతం వ్యక్తం చేశారు.

కొమ్మెరలో అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు..

చెన్నూర్ రూరల్, జనవరి 22 : చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామంలో నిర్వహించిన గ్రామ సభను రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ప్రత్యేకాధికారి మల్లికార్జున్ ఇందిరమ్మ ఇండ్లు, కౌలు రైతుకు బరోసా, పలు సంక్షేమ పథకాల్లో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను చదివి వినిపించారు. కాగా, తమ గ్రామంలో అధికారులు సర్వే సక్రమంగా నిర్వహించలేదని, ఉన్న వారికే అన్నీ మంజూరు చేస్తే పేదల పరిస్థితి ఏంటని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు కుంట శంకర్ గౌడ్, మంత్రి రాజయ్య సభను రద్దు చేయాలని స్పెషల్ ఆఫీసర్‌ను డిమాండ్ చేశారు. గంగారం గ్రామంలో కార్యదర్శి నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారంటూ గ్రామస్తులు మండిపడ్డారు. కాచన్‌పల్లిలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సిన గ్రామ సభ స్పెషల్ ఆఫీసర్ (ఎంపీడీవో) మోహన్ గంట ఆలస్యంగా రాగా, 3 గంటలకు గ్రామసభ ప్రారంభమైంది.

చింతలమానేపల్లి, గంగాపూర్‌లో ఆగ్రహం..

చింతలమానేపల్లి, జనవరి 22 : మండల కేంద్రంలో, గంగాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలని గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని మండిపడ్డారు. జాబ్ కార్డులు లేని నిరుపేదలు ఉపాధి హామీలో ఎలా పనిచేస్తారని అధికారులను నిలదీశారు. గంగాపూర్ గ్రామసభలో ఇందిరమ్మ కమిటీ ఎంపిక విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. పోలీసులు కలుగచేసుకోవడంతో గొడవ సద్దుమనిగింది.

కాసిపేట మండలంలో వాగ్వాదం..

కాసిపేట, జనవరి 21 : కాసిపేట, ముత్యంపల్లి, దేవాపూర్ తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో తమ పేర్లు లిస్ట్‌లో రాకపోవడంతో ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దాగారు. అర్హులైన తమ పేర్లు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. అసలు ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు అనేది కూడా కనీసం తెలుపకపోవడమేమిటని మండిపడ్డారు. చాలా మంది అర్హుల పేర్లు గల్లంతయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు దరఖాస్తులు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ గ్రామ సభలో పోలీసు బందోబస్తు నడుమ గ్రామ సభలు నడిపిన అధికారులు, త్వర త్వరగా దరఖాస్తులు స్వీకరించి సభలను ముగించేశారు.

రెబ్బెనలో నిలదీతలు, ఆందోళనలు..

రెబ్బెన, జనవరి 22 : రెబ్బెన మండలం నంబాలలో అర్హుల పేర్లు జాబితాలో లేవని గ్రామస్తులు నిలదీస్తూ ఆందోళన చేపట్టారు. ఇప్పటి వరకు చాలా సార్లు దరఖాస్తులు పెట్టుకున్నామని, ఆర్థికంగా నష్టపనోతున్నామే తప్ప పథకాల జాబితాలో పేర్లు ఉండడం లేదని అధికారులను నిలదీశారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని డీపీవో భిక్షపతి, పశువైద్యాధికారి సందీప్ గ్రామస్తులకు సూచించారు. వంకులం గ్రామంలో తనకు భూమి లేదని, ఆత్మీయ భరోసాలో పేరులేదని గ్రామస్తులు అమర్‌సింగ్ అధికారులను నిలదీశాడు. రోళ్ల పహాడ్‌లో సైతం గ్రామస్తులు ఆందోళన చేశారు.

కౌటాల మండలంలో వ్యతిరేకత..

కౌటాల, జనవరి 22 : కౌటాల మండలం మొగడ్ ధగడ్ గ్రామంలో గ్రామస్తులు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల కోసం తాము దరఖాస్తు చేసుకుంటే పేర్లు లేవని, అలాగే గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీల పేర్లు సర్వే లిస్టులో లేకపోవడంతో ఎందుకు లేవని అధికారులను ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీలు వెంటనే రద్దు చేయాలని, అర్హులందరికీ అన్యాయం జరుగుతున్నదని, కమిటీ సభ్యులను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామస్తులు డీటీ మస్కూర్ అలీకి వినతి పత్రం అందజేశారు. గ్రామసభలో కుర్చీలు కూడా లేకపోవడంతో గ్రామస్తులు ఎండలోనే నిలబడి ఉన్నారు. కనీసం తాగేందుకు నీరు కూడా అందించలేదు.

జనం నోర్లు మూయించిన పోలీసులు..

తాండూర్, జనవరి 22 : అర్హులైన లబ్ధిదారులకు నాలుగు పథకాల్లో పేర్లు రాలేదని గ్రామసభల్లో చెప్పుకునేందుకు వస్తే జనం నోర్లు మూయించేందుకు పోలీసులు రంగంలోకి దిగి, బలవంతంగా అడ్డుకున్న సంఘటనలు తాండూర్, అచ్చలాపూర్‌లో చోటుచేసుకున్నాయి. ఎమ్మెల్యే వినోద్ గ్రామసభలకు హజరవుతున్నారన్న ముందస్తు సమాచారంతో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, తాండూర్, మాదారం ఎస్ఐలు కిరణ్‌కుమార్, సౌజన్య, పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించారు. సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తే స్థానిక నాయకులు, పోలీసులు వెంటనే వారిని సభ బయటకు లాక్కెళ్లి అల్లరి చేయవద్దంటూ హెచ్చరించారు. దీంతో ప్రజలు తమ సమస్యలు, బాధలు ఎమ్మెల్యేకు చెప్పుకోవద్దా? అని ప్రశ్నించారు. అంతా సక్రమంగా ఉంటే ఎమ్మెల్యే చుట్టూ ఇంత మంది పోలీసు బలగాలు ఎందుకు అని ఆవేదన వ్యక్తం చేశారు. మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేస్తే తమ బతుకులను ఆగం చేస్తున్నారని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

ఎమ్మెల్యే వైఖరిపై కాంగ్రెస్ నాయకుడి అసహనం..

'మీ ఎన్నికల్లో కష్టపడి పని చేసిన, పార్టీ సీనియర్ నాయకుడిని, నా పేరు కూడా తెలువకుంటే నేను మీతో మాట్లాడుడెందుకు' ఇది ఓ కాంగ్రెస్ పార్టీ నాయకుడి ఆవేదన. అచ్చలాపూర్ గ్రామసభలో చోటుచేసుకున్న సంఘటన. ఎమ్మెల్యే వినోద్, అధికారులు, నాయకుల ఆధ్వర్యంలో గ్రామసభ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడిన అనంతరం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన కిష్టాగౌడ్ ప్రభుత్వ పథకాల్లో తన కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించేందకు సభలో నిలబడ్డాడు. ఆ వ్యక్తిని ఎమ్మెల్యే నీ పేరేంటి అని అడిగాడు. దీంతో దిగ్భ్రాంతి చెందిన కిష్టాగౌడ్.. 'పార్టీ సీనియర్ నాయకుడిని, మీ ఎన్నికల్లో గెలుపు కోసం కష్టపడి పని చేసా, నా పేరు తెలియదా..' అని ఎమ్మెల్యేపై గుర్రుగా మాట్లాడి అసహనం వ్యక్తం చేస్తూ తన పేరు చెప్పకుండా పక్కకు వెళ్లాడు. ప్రజలు సమస్యలపై నిలదీస్తారని అలోచించి గ్రామసభలో లబ్ధిదారుల లిస్టు చదివిన అనంతరం ఎమ్మెల్యే ప్రసంగించాల్సి ఉండగా, ముందే ఎమ్మెల్యేతో మాట్లాడించారు. అనంతరం ఎమ్మెల్యే వెళ్లిపోయిన తర్వాత లిస్టు చదవడంపై ప్రజలు నిరాశకుగురయ్యారు. ఇవి ప్రజల సమస్యలు పరిష్కరించే గ్రామసభలా.. లేక అధికారులు ముందే వ్యూహాత్మకంగా ఏర్పాటు చేసుకున్న సభలా అని మండిపడ్డారు.

గంజాయి సాగు కేసులో నలుగురికి జైలు

కెరమెరి, జనవరి 22 : గంజాయి సాగు చేస్తున్న కేసులో మహర్లే మధుకర్‌కు పదేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, కదవండి ప్రవీణ్, గొండ ప్రణయ్, దరి మణికంతకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జిల్లా సెషన్ కోర్ట్ ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పునిచ్చారని కెరమెరి ఎస్ఐ విజయ్ తెలిపారు. 2021, సెప్టెంబర్ 21న అప్పటి ఎస్ఐ ఈ రమేశ్ పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో గోయగాం నుంచి వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేశారు. కదవండి ప్రవీణ్, గొండ ప్రణయ్, దరి మణికంత వద్ద కేజీ గంజాయి లభించింది. వీరు ముహర్లే మధూకర్‌కు విక్రయిస్తున్నట్లు వారు చెప్పారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా, ఇంట్లో సుమారు 2 కిలోల గంజాయి, వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు లభించాయి. అప్పటి వాంకిడి సీఐ సుధాకర్ ఎన్డీపీస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపర్చగా, పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి ఎంవీ రమేశ్ విచారణ జరుపగా, నేరం రుజువవడంతో వారికి విక్ష విధిస్తూ తీర్పు నిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. శిక్షపడడంలో కృషిచేసిన పీపీని, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్ఐ విజయ్, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ అధికారి రామ్‌సింగ్, కోర్ట్ సిబ్బందిని ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

చెట్లు నరికినందుకు జరిమానా

బెల్లంపల్లి, జనవరి 22 : ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని చెట్లు నరికివేసినందుకు దుగ్నెపల్లి మాజీ సర్పంచ్ డోలే సురేశ్‌కు బుధవారం అటవీ శాఖ అధికారులు రూ.50వేలు జరిమానా విధించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎంపీడీవో ఆవరణలో టేకు, ఇతర చెట్లను నాటారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇల్లు నమూనా కోసం కార్యాలయ ఆవరణలో నిర్మాణాలు చేపడుతున్నారు. నమూనా ఇల్లుకు అడ్డుగా ఉన్నాయని టేకు, ఇతర చెట్లను ఎక్కడికక్కడ నరికివేశారు. దీంతో ఈ నరికివేత గురించి బీఆర్ఎస్ మండల నాయకులు కలెక్టర్, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అనంతరం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడిని బాధ్యుడిని చేస్తూ అటవీశాఖ అధికారులు జరిమానా విధించారు.

రహదారి భద్రతపై అవగాహన

రామకృష్ణాపూర్, జనవరి 22 : జాతీయ రహదారి భద్రతావారోత్సవాల్లో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి రామకృష్ణాపూర్ రామాలయం చౌరస్తాలో 2వ వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ ఆధ్వర్యంలో వాహనదారులకు బుధవారం అవగాహన కల్పించారు. మంచిర్యాల జిల్లా అసిస్టెంట్ ఎంవీఐ షేక్ ఖాసిం సాహెబ్ పలు విషయాలను వివరించారు. అనంతరం రహదారి భద్రత కరపత్రాలను వాహనదారులకు పంపిణీ చేశారు.

కాసిపేట, జనవరి 22 : కాసిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఖాసీం సాహెబ్, సూర్యతేజ రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారం, జనవరి 22 : రాఘవేంద్ర కరిమల కళాశాలలో విద్యార్థులకు మంచిర్యాల ఎంవీఐ కిషోర్ చంద్ర అవగా హన కల్పించారు. ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్, కరస్పాండెంట్ ఎర్ర సంపత్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్

ఆర్టిజన్ల రిలే దీక్షకు సంఘీభావం తెలుపుతున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, జనవరి 22: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిర్యాలలోని విద్యుత్ శాఖ ఎస్ ఈ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి, సంఘీభావం తెలిపారు. విద్యుత్ శాఖలోని డిస్కంలు, జెన్కోలు, డిస్ట్రిబ్యూషన్ కంపెనీల పరిధిలలోని సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరించాలన్నారు. 20 ఏళ్లకు పైబడి సంస్థనే నమ్ముకుని పనిచేస్తున్న కార్మికుల విషయంలో ఉదాసీనత పనికిరాదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వారి శ్రమను గుర్తించి 2017వ సంవత్సరంలో ఆర్టిజన్ అనే పేరుతో 23,959 మందిని క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. సంఘీభావం తెలిపన వారిలో బీఆర్ఎస్ నాయకులు గాదెసత్యం, గోగుల రవీందర్‌రెడ్డి, తోట తిరుపతి, ఎడ్ల శంకర్, కర్ర శంకర్, పల్లపు రాజు ఉన్నారు. రిలే దీక్షల్లో ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ నాయకులు తిరుపతి, నగేశ్, కార్మికులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 22: జిల్లాలో అగ్ని ప్రమాదాల నుంచి అప్రమత్తంగా ఉంటూ ఆస్తులను రక్షించుకుందామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో నూతనంగా ప్రభుత్వం కేటాయించిన అగ్నిమాపక వాహనాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా అగ్నిమాపక అధికారి సురేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఆసిఫాబాద్ అగ్ని మాపక కేంద్రానికి నూతన వాహనాన్ని కేటాయించిందని, ఆసిఫాబాద్ అగ్నిమాపక కేంద్రంలో ప్రస్తుతం 2 వాహనాలు ఉన్నాయని, కాగజ్ నగర్ కేంద్రంలో 1 వాహనం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ అగ్ని మాపక అధికారులు కార్తీక్ యాదవ్, భీమన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కోతులకు ఆహారం వేసిన ఇద్దరికి జరిమానా

హాజీపూర్, జనవరి 22 : గఢ్‌పూర్ పంచాయతీ పరిధి పాత మంచిర్యాల సెక్షన్ తిమ్మాపూర్ బీట్ ఎంసీసీ క్వారీలో కోతులకు ఆహారం వేసిన జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన మిర్యాల శివ, గడ్డం జగన్‌కు రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు బుధవారం సెక్షన్ అధికారి హతవుల్లా తెలిపారు. కోతులకు ఆహారం వేయడం వల్ల కలిగే అనర్థాల గురించి వారికి వివరించామని పేర్కొన్నారు. పాత మంచిర్యాల, తిమ్మాపూర్ బీట్ల ఆఫీసర్లు రాజేందర్, సంతోష్ ఉన్నారు.

ప్రజల రక్షణకు కృషి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 22 : ప్రజల రక్షణ కోసం పోలీసులు కృషి చేస్తున్నారని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. డీపీవోలో బుధవారం జిల్లా పోలీస్ క్యాలెండర్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు విజయ శంకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్ స్వామి దేవాజి, అరేయ్ పెద్దన్న, అంజన్న, నాగుల్ మీరా, ఆర్ ఎస్ఐ ఓదెలుతో కలసి ఆవిష్కరించారు. ఉద్యోగోన్నతి పొందిన ప్రభాకర్, నర్సింగ్, అంబారావు, సిరాజ్ హుస్సేన్, కిషోర్‌కు ఎస్పీ స్టార్స్‌ను అలంకరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. బాధ్యత పెరుగుతుంద ని, క్రమశిక్షణతో విధులు నిర్వహించి ప్రజల మన్నన పొందాలన్నారు.

117 కిలోల గంజాయి దహనం

జిల్లాలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ సుమారు రూ.74 లక్షల విలువ గల 117 కిలోల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా నియమాలు పాటిస్తూ కరీంనగర్ జిల్లాలో దహనం చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు ప్రకటనలో తెలిపారు. అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, పోలీసులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం

కాగజ్‌నగర్, జనవరి 22 : ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. కాగజ్‌నగర్ మండలంలో కొనసాగుతున్న గ్రామ సభలను బుధవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నదని, అర్హులకు తప్పకుండా ప్రభుత్వ ఫలాలు అందుతాయన్నారు. లబ్ధిదారుల పేర్లు జాబితాలో లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే అనర్హుల పేర్లు జాబితాలో ఉంటే గ్రామ సభలో గుర్తించి, తొలగించాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ప్రత్యేకాధికారి పృథ్వీరాజ్, సాంకేతిక సహాయకులు సోయబ్, ఏఈవో శ్రీనివాస్, రెవెన్యూ అధికారి సునిత, క్షేత్ర సహాయకులు గులాబ్‌దాస్, ఐకేపీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బెల్లంపల్లి, జనవరి 22 : బెల్లంపల్లి పట్టణంలోని 22వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్ పాల్గొన్నారు. అర్హులందరికీ రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 22 : జిల్లాలో బేటీ బచావో–బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్ నుంచి కుమ్రంభీం రస్తా వరకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. మార్చి 8వ తేదీ వరకు ఉత్సవాలు ఉంటాయని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు శారద, మమత, రాణి, విద్యార్థిను లు, సిటీ కేంద్రం సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు వీడ్కోలు

చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానిస్తున్న అధికారులు, కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్, జనవరి 22 : మంచిర్యాల మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్‌తో పాటు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులను కమిషనర్ మారుతీ ప్రసాద్, అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన మహిళా కౌన్సిలర్లు

'సీఈఐఆర్'ను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల అర్బన్, జనవరి 22: మొబైల్ ఫోన్ పోయినా, చోరికి గురైనా వెంటనే సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా కనుగొని బాధితులకు అందిస్తామని, ఈ సేవలను వినియోగించుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ నేతృత్వంలో సీసీఎస్, ఐటీ సెల్ బృందాలు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల రికవరీ మేళా నిర్వహించి బాధితులకు వాటిని అందజేశారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ సీసీపీ రాఘవేంద్రరావు, సీసీఎస్ సీఐ కమలాకర్, ఐటి సెల్ సీఐ చంద్రశేఖర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతునన మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీమ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ తెలిపారు. మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీమ్ లతోపాటు క్రిప్టో కరెన్సీ, ఆగ్రో గార్మెంట్స్, హెర్బల్ అండ్ హెల్త్, గృహ పరికరాలు వంటి వాటిపైన పెట్టుబడులు పెట్టి పెద్ద మొత్తంలో లాభాలు సంపాదించుకోవచ్చునని నమ్మించి డబ్బులను దోచేస్తున్నారని తెలిపారు.

ఇసుక రీచ్‌ల ఏర్పాట్లకు ప్రతిపాదనలు

నస్పూర్, జనవరి 22 : జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌లకు అదనంగా 5 రీచ్‌ల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి భూగర్భ గనులు, జల, పంచాయతీ, నీటిపారుదల, నీటి సరఫరా శాఖ, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. హాజీపూర్ మండలం ముల్కల్ల, వేంపల్లి బ్లాక్ 1, 2, నస్పూర్ మండలం తాళ్లపల్లి, జైపూర్ మండలం ఇందారం ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.